క్లుప్తంగా

లింగమూర్తికి సన్మానం

కడప రూరల్ : నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు పత్తూరు గురుస్వామి మాట్లాడుతూ లింగమూర్తి బీసీ భవన్ నిర్మాణానికి విశేషంగా కృషి చేశారన్నారు. అలాగే బీసీ వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేయడం అభినందనీయమన్నారు. బీసీ భవన్ నిర్మాణానికి సహకరించిన డిప్యూటీ సీఎం అంజద్ బాష, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

న్యాక్ ఏ ప్లస్ గ్రేడింగ్‌పై అభినందన



ఏపీ ఉన్నతవిద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డితో కళాశాల డైరెక్టర్లు

వైవీయూ : కడప నగరం పక్కీరుపల్లెరోడ్డులోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాల నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ ప్లస్ గ్రేడింగ్ సాధించడంపై ఏపీ ఉన్నతవిద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి అభినందించారు. బుధవారం మంగళగిరిలోని ఏపీ ఉన్నతవిద్యా మండలి కార్యాలయంలో కడప శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాల న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడంపై కళాశాల యాజమాన్యం చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాల కరస్పాండెంట్ డి.ఎస్.ఆర్. మనోహర్‌రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ ఎన్.పి. మధుసూదన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో బుధవారం ఉదయం గుర్తు తెలియని మహిళ ఫాతిమా పేరుతో (40) అనారోగ్యంతో చేరింది. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె వద్ద సహాయకులుగానీ, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్లు లేవు. దీంతో మహిళ మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ఆమెకు సంబంధించిన బంధువులు ఉంటే తమను నేరుగా సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ తెలిపారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన



మాట్లాడుతున్న మునగా సతీష్

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు పుస్తక పఠనం చేసి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని నగర ప్రముఖులు మెంటా వెంకట పవన్ తెలిపారు. బుధవారం నగరంలోని శారదా విద్యా సమాజం ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఎక్కం యూఎస్ఏ, ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం తరుపున పాఠశాల లైబ్రరీకి 750 పుస్తకాలను అందజేశారు. మునగా సతీష్ పుస్తకాల ప్రాధాన్యత వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ జనార్దన్‌రాజు, ప్రధానోపాధ్యాయులు జీఎంవీ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కడప కార్పొరేషన్ : వైఎస్ విజయమ్మ జన్మదిన సందర్భంగా రక్షణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మాసాపేట లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య ముఖ్య అతిథిగా హాజరై ఆ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అ ధ్యక్షుడు వినోద్ కుమార్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, శ్యాంసన్ పాల్గొన్నారు.

మంజూమియా పార్కు అభివృద్ధి ప్రశంసనీయం

కడప రూరల్ : స్థానిక గుంత బజార్‌లోని మంజూమియా సర్కిల్ అభివృద్ధి పనులను చేపట్టడం అభినందనీయమని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. బుధవారం ఆ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంతబజార్‌లో ఉన్న మంజూమియా పార్క్ ఎన్నో ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉండేదన్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాష, మేయర్ సురేష్‌బాబు, కార్పొరేటర్ షఫీ ఇతర అధికారులు ఈ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు.

ఘనంగా జెడ్పీ చైర్మన్ జన్మదిన వేడుకలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జన్మదిన వేడుకలను జెడ్పీ ఉద్యోగులు బుధవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ చాంబర్‌లో కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆకేపాటి చైర్మన్ పదవి చేపట్టాక గతంలో ఎన్నడూ రీతిలో కారుణ్య నియామకాల కింద చాలామందికి ఉద్యోగాలు ఇప్పించి వారి కుటుంబాలను ఆదుకున్నారని కొనియాడారు.

రాజీవ్ మార్గ్ పనులను పూర్తి చేయాలి



16వ డివిజన్‌లోని ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : రాజీవ్ మార్గ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం ఆయన మాసాపేట రోడ్డు, ప్రకృతి వనం, నర్సరీ, జర్నలిస్టు కాలనీ పార్కు, రాజీవ్ మార్గ్ ప్రాంతాలను పరిశీలించారు. మాసాపేట రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ స్తంభాలను మార్చాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కడప ప్రకృతి వనం, నర్సరీలో లలితాంబ గుడి వెనుక ఉన్న స్థలంలో ఫలహారాలు ఇచ్చే చెట్లు నాటించి సంరక్షించాలన్నారు. జర్నలిస్టు కాలనీ పార్కులో మొక్కలు నాటించి పిల్లలు ఆడుకోవడానికి పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. రాజీవ్ మార్గ్ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. అంతకుముందు ఆయన 16వ డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్, బీఎస్ తాండ, సుబ్బన్నగారిపల్లె ప్రాంతాలను పరిశీలించారు. ఇందిరా నగర్‌సర్కిల్ వద్ద రోడ్డు మరమ్మతులు చేయించాలని, నీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని సూచించారు. సీపీ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎన్. ప్రసాద్‌రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక ఒక వరం



సెక్టోరియల్ అధికారులతో కలిసి డిక్షనరీలను చూపుతున్న ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక ఒక వరం అని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న విద్యాకానుకలో భాగంగా బుధవారం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు స్థానిక విద్యావనరుల కేంద్రంలోని స్టాక్ పాయింట్‌కు చేరుకున్నాయి. సంబంధిత డిక్షనరీలను సమగ్రశిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న జగనన్న విద్యాకానుకను పాఠశాలలు ప్రారంభం నాటికే విద్యార్థులకు అందించాలని సంకల్పించిందన్నారు. విద్యాకానుకలో భాగంగా జిల్లాకు సంబంధించి 158721 మంది విద్యార్థులకు విద్యాకానుక అందించనున్నామన్నారు. ఇందులో భాగంగా 18,950 డిక్షనరీలు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరుకున్నాయన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది జగనన్న విద్యాకానుక కిట్లు నేరుగా మండల కేంద్రాలలోని స్టాక్ పాయింట్లకు వస్తాయన్నారు. విద్యాకానుక పంపిణీ పారదర్శకంగా ఉండేందుకు జిల్లాతోపాటు మండల కమిటీలను కూడా ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు ధనలక్ష్మి, కేశవరెడ్డి, దశరథరామిరెడ్డి, ఎంఈఓ పాలెం నారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య విషయాలపై జాగ్రత్తలు వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవిని దృష్టిలో పెట్టుకుని శిశు గృహాలో ఉన్న పిల్లల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. బుధవారం నగరంలోని కొండాయపల్లెలో గల శిశుగృహను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సందర్భంగా పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా సత్వరమే వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం శిశు గృహలో ఉన్న పిల్లల వివరాలను, వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శిశు గృహ మేనేజర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణలో అప్రమత్తత అవసరం



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

వైవీయూ : అనుకోకుండా జరిగే ప్రమాదాల నివారణలో అప్రమత్తత అవసరమని జిల్లా అగ్నిమాపకశాఖ సహాయ అధికారి బసిరెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో అగ్నిప్రమాదాలు, విపత్తుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ మంటలు, అడవి ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు, పెట్రోలియం బంకుల్లో జరిగే ప్రమాదాల గురించి, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ అధికారులు వై. రవిశేఖర్, వై. సావిత్రి, శివరామకృష్ణ, నరసింహారావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బధిరుల ఐపీఎల్ క్రీడాకారుడికి చేయూత



బధిర క్రికెటర్ రాజుకు కిట్ అందజేస్తున్న సీఏవైడీ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన బిల్లా రాజుకు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ అండగా నిలిచింది. బధిరుల ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఎంపికవడం పట్ల అయన్ను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, ఎ. రెడ్డిప్రసాద్ అభినందించారు. బుధవారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో రాజుకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్ చేతుల మీదుగా కిట్‌ను అందజేశారు. ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు కోల్‌కతాలో నిర్వహించనున్న బధిరుల ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాణించాలని క్రికెట్ సంఘం ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం సభ్యులు టి. నాగేంద్రకుమార్, సిరాజుద్దీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హజరత్ యదుల్లా మాలిక్ గంధోత్సవం

కడప కల్చరల్ : కడప నగరంలోని ప్రముఖ సూఫీ ఆధ్యాత్మికమైన అమీన్‌పీర్ దర్గాలో బుధవారం హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా యదుల్లా మాలిక్ మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ ఉరుసు ప్రారంభమైంది. ఈ ఉత్సవాలలో భాగంగా తొలిరోజున గంధం సమర్పణ నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చి గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాష, ఇతర నేతలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం రాత్రి ఉరుసు నిర్వహించనున్నారు.

రక్షణ గోడ పనులు మొదలు పెట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని సిద్దవటవం మండలంలోని పెన్నా సమీప గ్రామాలకు సంబంధించిన రక్షణ గోడ పనులను వెంటనే మొదలు పెట్టాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టీఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండల పరిధిలోని లింగం పల్లి-టక్కోలి వరకు పెన్నానది వెంబడి రక్షణ గోడ నిర్మాణం చేపట్టి భవిష్యత్తులో వరద ముప్పుకు గురి కాకుండా చూడాలన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిమండలం విజయ్ సుశీల్ కుమార్, నాయకులు అవినాష్, మామిళ్ల బాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ప్రొద్దుటూరు : రైతులందరూ ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పంటలను సాగు చేయాలని అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రొద్దుటూరు మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ ఏడాదిపాటు ఏయే పంటలు సాగు చేసుకోవచ్చో వివరించారు. నవధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. సమావేశంలో రైతులు మల్లికార్జునరెడ్డి, భూషణ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బాలసూరారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్యాంసుందర్, రాజు, బయపురెడ్డి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు అభినందన

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలను ఎక్కడ ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా నిర్వహించడంతోపాటు మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించారని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డీఈఓను అభినందించారు. ఈ మేరకు బుధవారం కడప మూల్యాంకన కేంద్రం క్యాంపు కార్యాలయంలో డీఈఓను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మురళి, రాష్ట్ర కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, రామచంద్ర, రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయాలి



విద్యార్థి ఖుర్రతుల్ ఐన్‌కు ల్యాప్‌టాప్ అందచేసి అభినందిస్తున్న నగర మేయర్ సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర మేయర్ సురేష్‌బాబు సూచించారు. దేశవ్యాప్తంగా మార్చి 25న జరిగిన జాతీయ స్థాయి ఒలంపియాడ్ పరీక్ష ఫలితాల్లో కడప నగరంలోని శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి షేక్ ఖుర్రతుల్ ఐన్ అనే విద్యార్థి కడపజోన్ పరిధిలో మొదటి గ్రాండ్ ప్రైజ్ ల్యాప్‌టాప్‌ను గెలుపొందాడు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభకు నగర మేయర్ సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థికి చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్యతో కలిసి ల్యాప్‌టాప్ అందచేసి అభినందించారు. చైతన్య ఏజీఎం రమణయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జరిగిన జాతీయస్థాయి ఒలంపియాడ్ పరీక్షా ఫలితాల్లో కడప జోన్ నుంచి ముగ్గురు విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్‌లు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షర్మిల, అకడమిక్ డీన్ మల్లికార్జునరెడ్డి, ఐకాన్ ఇన్‌చార్జు శ్రావణ్, సీ బ్యాచ్ ఇన్‌చార్జు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించాలి



ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న ఎన్‌సీసీ సీఓ లెఫ్టినెంట్ కల్నల్ థాపా, డైరెక్టర్ వివేకానందరెడ్డి

వైవీయూ/కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు చదువుతో పాటు కో కరికులర్, ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్‌లో కూడా పాల్గొంటూ సర్వతోముఖాభివృద్ధి సాధించాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా పేర్కొన్నారు. బుధవారం చిన్నచౌకులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో ప్రీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కల్నల్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, నడవడిక ఎంతో ముఖ్యమన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్, జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు ఎం.వివేకానందరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో అత్యాధునిక వసతులు, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉత్తమ బోధన సాగిస్తున్నామన్నారు. ఐడీపీఎస్ కో-ఆర్డినేటర్ సంధ్య మాట్లాడారు. అనంతరం ప్రీ స్కూల్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ హరికృష్ణ, లక్షుమయ్య, ఓబులరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను విస్మరించిన కేంద్రం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సమైక్యత, సమగ్రతను విస్మరిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం నగరంలోని రామకృష్ణ నగర్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రచార భేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చి ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతూ ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతోందని ధ్వజమెత్తారు. నల్లధనం వెలికితీత, రైతుల ఆదాయం రెట్టింపు, పేదరిక నిర్మూలన, ఏడాదికి కోటి ఉద్యోగాల కల్పన, ధరల స్థిరీకరణ దేశ సమైక్యత, సమగ్రాభివృద్ధిని సాధించడంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. వామపక్ష నాయకులు వెంకట శివ, రామ్మోహన్, బాదుల్లా, మద్దిలేటి, సుధాకర్ పాల్గొన్నారు.

జవాన్ల మరణానికి బీజేపీయే కారణం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జమ్మూ-కాశ్మీర్‌లోని పుల్వామాలో జవాన్ల మరణానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, బండి జకరయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాభవన్‌లో వారు మాట్లాడారు. జమ్మూ-కాశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది జవాన్లపై పాకిస్తాన్ ఉగ్రవాద చర్య విషయమై ఆనాటి గవర్నర్ సత్యపాల్ మాలిక్ తెలిపిన వివరాలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయన్నారు. జవాన్ల మరణానికి పాకిస్తాన్ కుట్రల కంటే కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలే ప్రధాన కారణమని మండిపడ్డారు.

'శ్రీనివాస'లో ఘనంగా జాతీయస్థాయి ఫెస్ట్

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఫెస్ట్ కనెక్ట్ -2కె23 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఫెస్ట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతికతను వెలికి తీసేందుకు ఈ ఫెస్ట్ దోహదపడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరై పేపర్ ప్రజెంటేషన్ చేశారు. ఇందులో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

• 'దుమ్ము' రేపుతున్నారు



రిమ్స్ పోలీస్‌స్టేషన్ ప్రక్కన బైపాస్ రోడ్డులో పెద్ద ఎత్తున రేగుతున్న దుమ్ము, ధూళి

కడప కార్పొరేషన్: కడప నగరంలో రిమ్స్ పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న బుడ్డాయపల్లె చెరువులోంచి వారం రోజులుగా మట్టి తోలుతున్నారు. రిమ్స్ పక్కనే ఉన్న కల్వర్టు పక్కనుంచి ఈ టిప్పర్లు మట్టిని రవాణా చేస్తున్నాయి. భారీ వాహనాలు పదే పదే తిరగడం వల్ల కింద ఉన్న చెరువు మట్టి అంతా నున్నగా పౌడర్‌లా తయారైంది. కడప-తిరుపతి బైపాస్‌రోడ్డులోకి అదంతా వచ్చి రాకపోకలు సాగించే వారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. టిప్పర్లు వచ్చినప్పుడల్లా పెద్ద ఎత్తున దుమ్ము, ధూళీ రేగి వాహనదారుల కళ్లలో పడుతోంది. ఈ మట్టి కాలుష్యం బారిన పడి ఈ ప్రాంతమంతా ఎర్రగా మారిపోయింది. అధికారులు స్పందించి బైపాస్‌లోకి మట్టి చేరకుండా చర్యలు చేపట్టడంతోపాటు, మట్టి తోలే ప్రదేశంలో నీటిని చల్లి దుమ్ము లేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'కళ'ల విద్యకు నీరాజనం

కళలకు కాణాచిగా నిలుస్తున్న వైఎస్ఆర్ జిల్లాలో మరిన్ని కళాకాంతులు వెదజల్లేలా.. కళాకారులకు ఉపయుక్తంగా ఉండేలా కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ప్రతిష్టాత్మక న్యాక్ ఏ గ్రేడింగ్ కలిగిన యోగి వేమన విశ్వవిద్యాలయం కూచిపూడి నృత్యం ,కర్ణాటక సంగీతం, కీబోర్డు కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తోంది. ఈనెల 19 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. 29వ తేదీ వరకు గడువు ఉంది.

- వైవీయూలో కూచిపూడి, కర్ణాటక సంగీతం, కీబోర్డుల్లో సర్టిఫికెట్ కోర్సులు
- దరఖాస్తుకు ఈనెల 29 వరకు గడువు
- గత ఏడాది 100 శాతం సీట్లు భర్తీ



నృత్యప్రదర్శనలో వైవీయూ కూచిపూడి విద్యార్థులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో 2010లో లలితకళల శాఖ ఏర్పాటైంది. దాదాపు 12 సంవత్సరాల తర్వాత కూచిపూడి, కర్ణాటక సంగీతం, కీబోర్డు నూతన కోర్సులను సర్టిఫికెట్ కోర్సులుగా గతేడాది ప్రారంభించారు. కాగా గతంలో సంగీతం, నృత్యం వంటి కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సులు చేయాలంటే హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయంలో కోర్సులు ఉన్నప్పటికీ అవి కేవలం మహిళలకు మాత్రమే కేటాయించడంతో శిక్షణ పొందాలనుకున్న వారికి అవకాశం లభించేది కావు. చాలామంది ఔత్సాహికులు ప్రైవేట్‌గా నృత్యం, సంగీతం శిక్షకుల వద్ద నేర్చుకుంటున్నప్పటికీ వారు గుర్తింపు పొందిన విద్యాలయం నుంచి సర్టిఫికెట్ పొందాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వివిధ వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న వైవీయూ అధికారులు అన్ని వర్గాల వారి కోసం సర్టిఫికెట్ కోర్సులు సాయంత్రం వేళల్లో అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై వైవీయూ ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, లలితకళల విభాగం ఆచార్యులు మూల మల్లికార్జునరెడ్డిలు వివిధ విశ్వవిద్యాలయాల్లో ఈ కోర్సులను అధ్యయనం చేసి వైవీయూలో ప్రవేశ పెట్టడంలో కీలకంగా వ్యవహరించారు. కాగా ప్రస్తుతం చదువుకుంటున్నవారు, ఉద్యోగాలు చేసేవారు, ప్రైవేట్‌గా శిక్షణ పొందుతున్న కళాకారులు ఇలా ఏ రంగానికి చెందినవారైనా ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. దీనికి సంబంధించిన శిక్షణ సైతం వైవీయూతో పాటు కడప నగరంలోని వైవీయూ అనుబంధ కళాశాల శ్రీహరి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తారు. అయితే గతేడాది 100 శాతం సీట్లు భర్తీ కావడం ఈ కోర్సులకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

కోర్సుల వివరాలు..

కూచిపూడి నృత్యం (క్లాసికల్ డాన్స్), కర్ణాటక సంగీతం (క్లాసికల్) కీబోర్డు (ఇన్‌స్ట్రుమెంటల్) కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తారు. ప్రతి కోర్సులో 50 సీట్లు ఉన్నాయి. 10 సంవత్సరాలు వయసు నిండి ప్రాథమిక పరిజ్ఞానం కలిగిన బాలబాలికలు ఇందులో ప్రవేశాలు పొందవచ్చు. కోర్సు ఫీజు రూ. 5 వేలు. కోర్సు వ్యవధి : యేడాది. దరఖాస్తులు వైవీయూలోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో లభిస్తాయి. ఈనెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.యోగివేమనయూనివర్సిటీ.ఏసీ.ఇన్‌లో లభిస్తాయి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కోర్సులు..

జాతీయ నూతన విద్యావిధానం అనుసరించి విద్యాసంస్థల్లో సహ పాఠ్యాంశాలుగా నృత్యం, సంగీతానికి ప్రాధాన్యత ఇవ్వడంతో ఈ కోర్సులకు డిమాండ్ పెరగనుంది. ఈ కోర్సులను సర్టిఫికెట్ కోర్సుగా రాయలసీమలో అందిస్తున్న విశ్వవిద్యాలయం వైవీయూ కావడం విశేషం. ఈ కోర్సు పూర్తి చేయడంతో పాటు ఇదే రంగంలో మరిన్ని ఉన్నత కోర్సులు పూర్తి చేస్తే కళల నిర్వాహకులుగా, నృత్యదర్శకులుగా, సంగీత బోధకులుగా, మ్యూజిక్ డైరెక్టర్లుగా, గాయకులుగా, శిక్షకులుగా, విద్యాసంస్థల్లో అధ్యాపకులుగా అవకాశాలు లభిస్తాయన్నది నిపుణుల మాట.


విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విశ్వవిద్యాలయ ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు వరుసగా రెండో యేడాది కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, కీబోర్డు కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నాం. ఆసక్తి, అభిరుచి కలిగిన విద్యార్థులు ఈనెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకుని ప్రవేశాలు పొందవచ్చు. అంతర్గతంగా దాగి ఉన్న కళానైపుణ్యాలకు ఈ కోర్సులు పదును పెడతాయి.

– డాక్టర్ కోట మృత్యుంజయరావు, లలితకళల విభాగం సమన్వయకర్త, వైవీయూ

ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలి



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక 4వ ఆర్‌బీకేలో కమలాపురం డివిజన్ పరిధిలో ఎరువులు పురుగు మందుల దుకాణాదారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలన్నారు. మాకు గిట్టుబాటు కాదని, కంపెనీ సూచన మేరకు ఇలా అమ్ముతున్నామని చెప్పవద్దన్నారు. ఎంఆర్‌పీ ధరలకు విక్రయించక పోతే వాటికి జోలికి పోవద్దన్నారు. కాంప్లెక్స్ ఎరువుల వద్ద సమస్య ఏమీ లేదని, యూరియా వద్ద మాత్రం సమస్య వస్తోందన్నారు. ఒక్క రూపాయి అధిక ధరలకు విక్రయించినా సహించేదీలేదన్నారు. ప్రతి ఆర్‌బీకేలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. ఇప్పటికే ఎరువుల ధరలు తగ్గాయని, ఎరువుల కొరత వచ్చే ప్రసక్తే లేదన్నారు. అలాగే ఇక్కడ ఉన్న దుకాణాదారుల్లో 70 శాతం మంది రైతులేఉన్నారని, మీ పంటలకు ఏ విధంగా పురుగు మందులు వాడతారో రైతులకు కూడా అదే విధంగా ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డు ప్రతి రోజు అప్‌డేట్ చేయాలన్నారు. అలాగే కమలాపురంలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఉందని, ప్రతి టీడర్ మీరు విక్రయించే దిగుబడులను తప్పని సరిగా ల్యాబ్‌కు పంపి ఉచితంగా టెస్ట్ చేయించుకోవాలన్నారు. డివిజన్ పరిధిలోని ఏఓలు సరస్వతి, సాయిజ్యోతి, శ్యామ్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి, ల్యాబ్ ఏఓ మాట్లాడారు.